


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

4 . హత్యాచారం

ఇంటికి చేరేసరికి పది గంటల సమయం దాటింది. రాబోయే నిద్ర ఊరటనిస్తోంది. నాలుగు గోడలూ ఏర్పరచిన స్థలం మనుషుల చూపులను అడ్డుతుంది, రక్షణ ఇస్తుంది. ఇంతకన్నా ఈ క్షణాన అనంతానికి ఏమీ అక్కర్లేదు. అదే వరం. నిద్ర రాకపోతే ఆలోచన నుంచి మనసుకు రక్షణ ఉండదు; స్వయంకృతాపరాధం. ఈ నాలుగు గోడల మధ్య మనిషి తనకు కావలసిన లేక వీలైన విధంగా జీవించాలంటే పగలంతా విశాల ప్రపంచంలో గోడల మధ్యో, వెలుపలో కష్టపడాలి. ఒక వేళ అలా గడపటం నరకంగా అనిపించినా తనదైన ఇంట్లో, తన స్వర్గంలో గడపటానికి మొదటి దాన్ని భరించాలి.

గదిలోనైనా, విశాల ప్రపంచంలోనైనా మనసు తంటా ఎలాగూ తప్పదు. లోకంలో మార్పు రాదు మంచికి సంబంధించినంతవరకు. అంధకారం నుంచీ వెలుగు వైపు సాగవలసిన ఆధ్యాత్మిక పయనం, మనిషి గుణం చెడు నుంచీ మంచి వైపు జరగవలసిన పయనమూ స్తంభించాయి. అలావున్నా ఆవగింజంత నయం. తిరోగమనాలు జరుగుతున్నాయి. మంచి గుణంలో నైతిక విషయం అంతర్భాగమే. తనకు తాను స్ఫటికంలా తోస్తున్నాడు. నిజానికి చెడుగా ఉండగల 'సామర్థ్యమూ' తనలో లేదు అన్న భావంతో ఉన్నాడు. అది కేవలం ఒక భావమే కాదు అలా ఉండాలన్నది బలమైన కోర్కె. ఆ కోర్కె తనలో అంతరించగానే మనిషిగా తన పతనం ఆరంభమవుతుంది. లోకంతో సయోధ్యతోను, స్వీయ సుఖ శాంతులతోను మెసలడానికి తనలో ఏ మార్పు అవసరం? అది తనలో రావడం సాధ్యమా? 'డూ డూ బసవన్నా' అంటే తల ఊపుతుండటం ఉపయోగపడుతుందా, అలా చేయడం తన స్వభావానికి విరుద్ధంగనుక దాన్ని మార్చుకో గలడా?

దబ్బనంలా గుచ్చుకుంటూ గుర్తుచేస్తోంది ఆ వింత అనుభవం; దాంట్లో వేదాంతరావుకు సుంబంధించినంత వరకూ వింత లేదు, సహజమే. ఒక వేదాంతరావు నుంచి పారిపోయి ఒచ్చాడు. వేదాంతరావు కేవలం ఒక మనిషి కాదు;

కొన్ని గుణాల ఒక రూపం. మనుషులంతా అలాంటి అనంతకోటి గుణాల, రూపాల సముదాయాలు. అదే సమాజం. నక్క సూర్యుడి నుంచి పారిపోయే ప్రయత్నం చేసినట్టు అనంతం ఎక్కడికని పారిపోవటం సాధ్యం; చావు ద్వారంగుండా నిష్క్రమించడం తప్ప. సమాధానం లేని ప్రశ్నలు చుక్కలన్నీ. కొన్ని సమాధానాన్ని ఆశించేవి కాదు. అసలు, ప్రశ్నలు అని పేరుతో పిలిచినా, ప్రశ్నలే కాదు. కొన్ని ప్రశ్నలకు ప్రశ్నలే సమాధానాలు. చెరసాలలో ఉన్నాడు మిగతా నేరస్థులతో పాటు. నేరస్థ కానివాడు లేదు. నేరస్థులకు నేరస్థులు తోడు. తోడు అక్కరలేదు అనే వీలు లేదు. అడవిలోకి పారిపోయినవాడికి మృగాలు తోడు. ఇంతకూ నేరం? పుట్టడం. వాళ్ళు కావాలని పుట్టారా అని ప్రశ్న వేస్తే న్యాయమూర్తి ఒప్పుకోడు. పోనీ నేరస్థులు కాకపోతే పాపిష్ఠివాళ్ళు. నేరస్థుడు ఒంటరి చెరలో ఉండటం కన్నా పలువురితో ఉండటమే మేలా? అదా, ఇదా ఏది మేలూ? అనవసరమైన ప్రశ్నలా? ఏది కావాలంటే దాన్ని ఎంచుకునే స్వేచ్ఛ, వీలు లేనే లేవు. నీ తావు, స్థితి ఏమిటో; నీవెవరో – ఎవరో, ఎవతో నిర్ణయిస్తుంది. ఎవరు నిర్ణయించింది కూడా తెలియదు. ఎలుగెత్తి ఎవరిని అడిగేట్టు? ఎవరి ముందు ఆ అన్యాయాన్ని ఉంచేట్టు? మిగతా వాళ్ళతో కలిసి, మిగతా వాళ్ళలా జీవించడం నేర్చుకో. ఎలా జీవించాలో అన్నది మూకుమ్మడిగానూ, ఏ ఒక్కడి పాత్రా లేకుండానూ నిర్ణయించబడుతుంది. ఒక వేళ ఆ నిర్ణయం కాదనుకుంటే అజ్ఞాత శక్తి, నినియంతృత్వ శక్తి నిర్ణయిస్తున్నట్టు భావించుకునే స్వేచ్ఛ నీకు ఉంది. మిగతా వాళ్లలో ఒదిగిపో. అదే జీవించడానికి అవసరమైన కళ. అందులో మాధుర్యం గాని, సౌందర్యం కానీ, మరో హృద్యమైన అంశం కానీ లేక పోవచ్చు. అది కళ అనడానికి నిరాకరిస్తే నైపుణ్యం అని దానికి పేరు పెట్టుకో. అది కళ ఐతేనేమీ, నైపుణ్యం అయితేనేమి జీవించే వీలు కలిపిస్తున్నపుడు? జీవించడం అనేది అందరి సమస్యా అయినపుడు నీకు మాత్రం అది సమస్య కారాదు అనుకోడం ఏమి సబబు? నలుగురితో నారాయణ, కులంతో గోవిందా – అను. జీవించడం కాదు నా అసలు సమస్య 'ఇతరులు' అంటావా? జీవితంలో భాగాలే కదావాళ్ళు పోషించే పాత్రలు? ఈ చెరసాల తాళం కప్పను చావు మాత్రమే తనంతట తాను వచ్చి ఎవరిని అది ఒదలదలచుకుందో వాళ్ళను ఒదులుతుంది. అప్పుడే నీకు స్వేచ్ఛ. చెరసాల నీవు జీవించి ఉన్నదానికి రుజువు. విగత జీవికి స్వేచ్ఛ ఏమిటీ? చెరసాల, ఆరుబయట రెండూ సమానమే. అది ఒక గమ్మత్తైన విషయమే. తలుచుకుని నవ్వుకో, లేక ఏడ్చుకో, లేక తిట్టుకో – నీకు ఈ స్వేచ్ఛ ఉంది. నీకు ఈ స్వేచ్ఛ కావాలా అన్నది, ఏది ఇవ్వగూడదు అన్నది  ముందుగా నిర్ణయించబడుతుంది. బానిసలకు కొన్ని నిర్ణయించబడిన స్వేచ్ఛాలుంటాయి. పూర్తి బానిసత్వమూ ఉండదు, పూర్తి స్వేచ్ఛా ఉండదు. అందుచేత నీ ప్రేమను స్వేచ్ఛకూ బానిసత్వానికి పంచడం నేర్చుకోవాలి.

నిద్రలోకి జారిపోయాడు. ఇప్పుడు సుఖమూ లేదు, కష్టమూ లేదు. జీవితం నుంచి, మనసు నుంచి రక్షణ. సగం చావు, సగం బతుకు – ఇది బాధించని బతుకు. నిద్రా, మాయా? నిద్ర మాయనుంచీ మేలుకోడం కాకూడదా? మెళుకువ అని తెలియని మెళుకువ. కల మెళుకువలోని నిజమా?

దుస్తుల నుంచీ శరీరానికి స్వేచ్ఛ. ఆరుబయట వెల్లకిలా పడున్న నగ్న శరీరంలోని కళ్ళు నీలాకాశంతో వాటినవి నింపుకుంటున్నాయి. మబ్బు అడ్డడం లేదు. సిగ్గూ లేదు. సిగ్గెందుకుండాలి? చూడకూడని దాన్ని కాదు కదా చూపిస్తున్నది?

తప్పు కాదు కదా కప్పిపుచ్చుకోడానికి. నూలుపోగు బరువు లేని శరీరం దూదిపింజలా ఉంది. తిరుగుబాటులా ఉంది. ఎవరినుంచీ దాచుకో వలసిన అవసరం లేని చోటు; ఏకాంతం.

అది అసురసంధ్యవేళ కాబట్టి ఏ నక్షత్రము ఆకాశపు నగ్నత్వానికి అడ్డురాదు. ఉవ్విళ్లూరిస్తోంది చేరుకొమ్మని – ఆలింగనానికై. రెక్కలు లేవని దానికి తెలుసు. సరస్సు మీద నుంచి కనిపించని, వినిపించని ప్రియురాలిలా శరీరంలో దేన్నీ వదలకుండా స్పృశిస్తున్న చల్లగాలి; విశృంఖలుడు. ఉద్రేకపరిచి సుఖపు శిఖరాగ్రానికి చేర్చడానికి. పక్షుల ముచ్చట్లు. హాని అనేది రద్దు అయిన చోటు అని నమ్మబలుకుతున్నాయి అన్నీ – శబ్దాలూ, దృశ్యాలూ, స్పర్శలూ. ఇలాంటి చోట మానమూ జీవనమూ ఒకేలా హృద్యమైనవని అనిపిస్తోంది. నిద్రలా కళ్ళు మూతలు పడుతున్నాయి.

అప్పుడు కలలో ఒక జీవి అది ఎవరి మీద, దేని గురించి చేస్తున్నది తెలియక పోయినా, ఈదుతూ, పాకుతూ, నడుస్తూ, ఎగురుతూ ఒచ్చింది. దాన్ని మరో జీవితో పోల్చనూ వచ్చు, పోల్చడం అవకపోనూ వచ్చు. సర్వ జీవుల సమ్మేళనం ఐనా కావచ్చు; అన్ని జీవాలకూ మూలం అననూ వచ్చు, సర్వ జీవులూ కనిపించే దర్పణం కావచ్చు. అన్నింటి గుణాల సమ్మిశ్రమమూనూ. అన్నింటిలోనూ ఉండే కామం, కామద్రవం దీనిలోనూ ఉన్నాయి. కామం తీర్చుకోకుండా ఉండగల గుణమూ, దానితో అదే కామాన్ని తీర్చుకోగల గుణమూ  దానిలో ఉన్నాయి. లింగ భేదమూ, భేద రాహిత్యమూ దాంట్లో కలవు.

అది అతనిని ఆక్రమించింది; అతని నమ్మకం ఒమ్మయ్యింది. మనసు భాష్పరహితంగా ఏడ్చింది జుగుప్సకు తట్టుకోలేక. అతనినంతా రాక్షసబల్లో, రాక్షసనల్లో, మారువేషంలోని మొసలో, మనిషి 'ఇదీ' అనిపేరుపెట్టని ఇప్పుడే సృషించబడిన జీవో ఆక్రమించినట్టుంది. చావును రమ్మని ప్రార్థించాడు. ఏదో మరో జీవి వచ్చి దీని బారి నుంచి రక్షించకపోతుతుందా అని క్షణికమైన ఆశ. ఆ జీవి చెవిలో లాలనగా అంటోంది భూమ్మీద ఎవరూ ఇంతవరకూ మాట్లాడని భాషలో:

"నీకు మేలు చేయబోతున్నాను; నీ ప్రస్తుత బ్రతుకు బాధనుంచి నీకు వేరే మార్గం చూపబోతున్నాను. ఈ ప్రక్రియకు నీవు కదలకుండా ఉంటే రెండూ లేక మూడు నిముషాలు చాలు,"

కామపు బుసలు గబ్బుకొడుతున్నాయి. ఆ దుర్గంధమే ప్రాణం తీసేట్లుంది. కానీ తీయడం లేదే? పెనుగులాడారు. ఆపై ఏదో పెనుసంతోషం. ఆ జీవిలో పెనుసుఖం. వీపు క్రింది గడ్డి నలిగిపోతోంది. భూమి కృంగిపోతున్న భావన. చాతకాని దుఃఖం.

నిద్రతెర తొలగింది. స్వప్నం తొణికింది. మెలకువ దుఃఖం నుంచి రక్షించింది. కల నిద్రను చెరిచి మేలుకొలిపిందన్నవిచారం లేదు. తల ఎత్తి కుడివైపు కిటికీ దిశగా దృష్టి సారించాడు. అక్కడ అతని తోడుంది. టేబుల్ గడియారం టిక్కు టిక్కు మని శబ్దం చేస్తూనే ఉంటుంది, దాని ఉనికిని, అతని ఉనికిని, కాలం ఉనికిని తెలియజేస్తున్నట్టు. శరీరం అంతా చమటతోనో, మరిదేనితోనో తడిసిపోయింది – కలలోని జీవి జీవించిన సరస్సులో జెలకాలాడినట్టు. అతని

శరీరం అతనికి జుగుప్స కలిగిస్తోంది. ఎవరిదో మకిలికి తన శరీరం ఆశ్రయమిచ్చినట్టు. ఒదిలించుకోడం సాధ్యం కాదు. అణువణువునా, మనసూ శరీరాలలోకి విడదీయ లేని విధంగా మిళితమయ్యింది.

కనింది దుస్వప్నమా సుస్వప్నమా అన్న అనుమానం కలిగింది అనంతానికి. స్వప్నం ఏదైతే నేమి, అది నిజం కానప్పుడూ? అది అసలు స్వప్నం కాదని, ఒక వింత అని అనిపిస్తోంది. ఎందుచేతనంటే అది అతనిలో కలిగించిన పెను మార్పు. అది ఇంకా తెల్లవారకపోవడంపై అసహనాన్ని కలిగిస్తోంది. తనకు ఎదో అద్భుతమైన శక్తి సిద్ధించినట్టు, దాన్ని ఉపయోగించి ఫలాలను ఆరగిద్దామన్నట్టు. సంకెళ్లు వాటంతట అవి మంత్రం పెట్టినట్టు, దయతలచినట్టూ విడిపోయి స్వేచ్ఛను కలిగించినట్టు. ప్రకృతిని శాసించగల ధీమా అతని మనసులో చోటు చేసుకుంది. అతనిలో నూతన శక్తి "ఇంకా ఆలస్యం ఏమిటి?" అని ప్రశ్నిస్తోంది. అంతరాత్మ దీర్ఘ కాలిక సెలవులో చెప్పీ పెట్టకుండా తనలోని శక్తిని చూసి భయపడిపోయినట్టు లేని రెక్కలు తెచ్చుకుని ఎక్కడికో ఎగిరిపోయినట్టుంది. సంఘంలోని వ్యక్తికీ, వ్యక్తికీ ఉండే అనుకోని, రాసుకోని ఒప్పందం అతనికి సంబంధించినంత వరకూ రద్దయి పోయింది. మనిషి రాసుకుని వ్యవస్థీకరించిన చట్టాలు మాత్రమే వర్తిస్తాయి. అవి మాత్రమే భయపెట్టగలవు. దొరక కుండా ఉండగలిగినంత వరకూ వాటితో పేచీ లేదు. అతనికి కావలసిన విధంగా అనుభవించి ఆనందించడానికి మాత్రం జీవితం ఉంది. అందమైన వేశ్యలా తెరుచుకుని, పైసా నాకివ్వక్కరలేదని భరోసా కూడా ఇస్తూ. జీవితార్ధం గురించి ఆలోచించి మెదడును పిచ్చెత్తించుకోనక్కర లేదు. అనుభవించడమే దానర్ధం. మీకు సామర్ధ్యం ఉంటె చాలు – ఏ అరమరికా లేదు. తిరిగి నీకు నీవు దాన్ని విధించుకోకు. నీవు దేనికీ జవాబుదారీ కాదు, మరణానంతరము కూడా. దైవం మాటేమిటీ? ఉంటే అది ఇప్పుడు జీవించబోయేలా జీవించమని నిర్ధేశించలేదని ఎలా అనుకోవడము? దైవం లేకపోతె పేచీయే లేదు. తనలోని మార్పు దైవికమైనది కాదని ఎవరనగలరు? కలలోని భీతి మాధ్యమంగా అది తనకు దాన్ని ఒనగూర్చి ఉండవచ్చు.

చావడమా, బ్రతుకుతూ ఉండడమా అన్నదే మనిషి తేల్చుకో వలసిన విషయం. ఎలాబతకాలి? అన్నది కాదు; ప్రశ్నించడం అవసరం లేని సమాధానం – "ఎలాగైనా". జీవించదలచుకున్నపుడు నీవు కోరుకునే విలువలతో మాత్రమే జీవిస్తానని పట్టుపట్టడానికి వీలవదు. కొన్ని లేక ఎన్నో విలువలను ఒదులుకుని జీవితం విధించే షరతులకు లోబడి జీవించాలి. జీవించడం కన్నా, నేను నమ్మే విలువలన్నీ నాకు ముఖ్యమనుకుంటే మరణాన్ని ఆశ్రయించి వలసిందే. విలువల విలువేమిటీ? అవెందుకు పట్టుకు వేలాడతావు? విలువలకు విలువలె విలువ అని కావలిస్తే సమాధానం చెప్పుకోవొచ్చు. అది నాకిచ్చే మానసిక ఆనందం గురించి వాటిని పాటిస్తా అని ప్రకటించుకోవచ్చు. వాటికి నువ్వులూ నీళ్ళూ ఒదిలి శరీరం, మనసూ జోడీగా నాకు ఇచ్చే ఆనందమే నాకు జీవిత పరమావధి; ఇతరులను మోసం చేస్తూనైనా నేను జీవితంలో సాధించే 'విజయాలే' నాకు కావాలి అనుకోవచ్చు. "ఎవడో ఏడుస్తాడని నేను చేయదలచుకున్నది ఎందుకు మానుకోవాలి?" అని ఎదురు ప్రశ్న వేయవచ్చు. ఈ ఆలోచనల సారాంశాన్ని రెండు మాటలలో చెప్పు అంటే "ఇష్టము–అనిష్టము" మాత్రమే పడికట్టురాళ్లు మన జీవితంలో.

## 5. దేవుడి తిరుగుబాటు

నిన్నటి నుంచీ నూతన జీవితం ఆరంభమైంది అనంతానికి ఎవరో వరం ప్రసాదించినట్టు. రేపో మాపో కొత్త గదికి మారతాడు. రాత్రికల నమ్మలేనిదిగా ఉంది. గతించే జీవితమూ కొంతకాలానికి నమ్మలేనిదిగా, కలయా నిజమా అన్న సందిగ్ధంలోకి తోస్తుంది. సాయంత్రం కాసేపు జనంలో భుజాలు తాకుతూ తిరిగాడు. భుజాలు తాకుతూ తిరగడానికి చాలా చోట్లు ఉన్నాయి చేరువలోనే; పూర్ణా మార్కెట్టు లాంటివి. విసుకు అనిపించి ఏకాంతంలో రెండు గంటలు గడపాలనిపించింది; మానవ మృగాలు లేనిచోట. అతని కాళ్ళు కన్నెమేరెమ్మా కొండను ఎక్కించాయి. చర్చి వెనక్కు నడిచాడు. కొండంచు పిట్టగోడను చేరాడు. అది కూర్చోడానికి చాలినంత వెడల్పుగా ఉంది. చెట్ల మీద పక్షుల అరుపులు తప్ప పెద్దగా శబ్దాలు లేవు.

ఒక ఆకారం అనంతం వైపు వస్తోంది. పద్నాలుగేళ్ల బాలుడి శరీర పరిమాణంతో ఉన్న యువకుడు అనిపించింది అనంతానికి. నాలుగడుగులు అతను ముందుకు వేయంగానే అతని కలిసిపోయిన దట్టమైన గడ్డం మీసాలు కనిపించాయి. వాటిలోనుంచీ పెదవులు దొంగల్లా తొంగి చూస్తున్నాయి. కళ్ళు ఈ విశాల ప్రపంచాన్ని చూడటానికి అనువుగా ఉండాలన్నట్టు అతి విశాలంగా, వెండి చాపల్లా మిలమిల మంటూనూ ఉన్నాయి. విలువైన, తాను కష్టపడి సాధించిన వస్తువులన్నట్టు గడ్డం, మీసాలను సవరించుకుంటున్నాడు. తల అతని శరీరం మోయలేదేమో అన్నంత పెద్దదిగా ఉంది. మీది జుట్టు పెరిగి పైకి నిక్కబొడుచుకునుంది, ఎవరికీ తలవంచనన్నట్టు. ఏ దేవుడికో, దేవతకు మొక్కా? అతనూ ఎండమావిలాంటి ఒంటరితనం వెంట పడి వచ్చినట్టున్నాడు. శరీరాన్ని ఒక తెల్లరంగు పొడవు చేతుల చొక్కాలో దిగేసి దాన్ని రంగు తెలియని పంట్లాములోకి దోపుకున్నాడు. చొక్కా అంచు చిరిగిందేమో. అతని కోర్కెకు తాను ఆటంకం; అతను తన కోర్కెకు ఆటంకం.

"ఇలాంటి కురూపులను దేవుడు ఎందుకు సృష్టిస్తాడో. మనుష్యులకు రోత పుట్టేలా ఉన్నాడు వీడు," అనుకుని తల వేరే వైపు తిప్పుకున్నాడు అనంతం. మనుషులను ఏదో ఒక కారణంతో అసహ్యించుకునే గుణం కొత్తగా రావడం అతను గుర్తించాడు.

ఆ ఆగంతకుడు అసాధారణంగా కనిపించాడు అనంతానికి. భూమ్మీదకాక చంద్రగ్రహం లేక కుజగ్రహం మీదనో ఉన్నట్టు లేక అక్కడి నుంచీ భూమ్మీదికి పర్యాటకుడిలా ఊడిపడ్డట్లు నడుస్తున్నాడు. నడుస్తూ ఆకాశం వైపు చూస్తున్నాడు దేవుడి గురించీ వెతుకుతున్నట్లు. తనలో తాను వేసుకున్న జోకుకు తానె నవ్వుకుంటున్నట్టు కనబడ్డాడు. అనంతాన్ని వెక్కిరించడానికి పుట్టినట్టున్నాడు కూడా. అతను తన సాటి మనిషిలా అనంతానికి తోచలా. కానీ, కానీ అతని నడకలో

హుందాతనం దాగుంది. అనాకారితనంలో చర్మ సంబంధం కానీ అందం దాగుంది; చర్మ చక్షువులకు కనిపించనని అంటున్నట్టు. మన్మథుడు తన అందాన్ని దాచుకోడానికి కురూపి వేషం ధరించినట్టున్నాడు. ఈ లోకం తన సృష్టే నన్నట్టు దాన్ని పర్యవేక్షించడానికన్నట్టు ధీమాగా నడుస్తున్నాడు. తనదికాని సృష్టిని విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ నవ్వుకుంటున్నట్టునూ ఉన్నాడు.

అతను వేరే చోట కూర్చుని అనంతంతో చిరకాల పరిచయమున్నట్టు నవ్వాడు. అనంతం సమాధానంగా నవ్వలేకపోయాడు.

"మీరు కూర్చున్నచోటుకన్నా ఇక్కడ ఎక్కువ సుఖంగా ఉంటుంది. మనిషి సుఖోపజీవి. ఇక్కడికి రాండి," అన్నాడు.

జన్మజన్మల బంధం అనంతంతో ఉన్నట్టు లేక ఉండబోతున్నట్టు ఆప్యాయంగా ఆహ్వానించాడు. తన పక్కనున్న స్థలాన్ని ఎడమ చేత్తో తుడిచిశుభ్రం చేశాడు. అది అతని సొంత చోటు కాదు, ఇల్లూ కాదు. దగ్గిరసా వెళితే కౌగలించుకుని ముద్దుపెట్టుకోడుగదా తన ఆప్యాయతా మైకంలో?

"ఇక్కడే నాకు చాలా బావుంది," అన్నాడు అనంతం రెడ్డిగం వేసుకుని.

"మహమ్మదు గారు కొండను రమ్మని పిలిచి, అది రాకపోతే తానే వెళ్లారు. కొండ మన దగ్గిరికి వచ్చినా, మనమే దాని దగ్గిరికి వెళ్లినా ఒకటే కదా! ఏమంటారు?"

"ఇది మాత్రం అంటాను: మీరు మహమ్మదు గారు కాదు; నేను కొండానూ కాదు."

"మనం ఒక్కోసారి సరిగా ఆలోచించకుండా మాట్లాడుతుంటాం."

"నేను సరిగా ఆలోచించిన తరువాతే పెదవి విప్పుతాను."

అతనొచ్చి అనంతానికి మూడడుగుల దూరాన కూర్చుని తానూ రెడ్డిగం వేశాడు.

“సందేహం లేదు; మీది గొప్ప లక్షణం. మీ అందమైన శరీరానికి తగిన బుర్ర."

"అది గొప్పలక్షణం అని నేను ఆలోచించి మాట్లాడటం జరగదు; అదొక అలవాటు, అతి సామాన్యమైనది."

"మీరు సామాన్యంగా భావించే అలవాట్లు చాలామందిలో కొరవడి ఉండొచ్చు. అంచేత సామాన్యమైనవాటిగా ఏ అలవాట్లను, లక్షణాలనూ భావించకపోతే మంచిది. మీకు తోచినవిధంగా భావించే హక్కు మీకు కలదు. మంచి అలవాట్లు అందరికీ అబ్బవు," అనంతాన్ని పొగడ్త ద్వారా మచ్చిక చేసుకోడానికన్నట్లు అన్నాడు.

రెడ్డిగం వేసుకోడం సుఖం అనిపించక మామూలుగా కూర్చున్నాడు.

"ఇక్కడ కాసేపన్నా ప్రశాంతంగా కూర్చుని వెళదామని ఒచ్చాను," అనంతం అన్నాడు.

"నాతో మాట్లాడటానికి అభ్యంతరంలేని వ్యక్తి ఇక్కడ దొరక్కపోడు పనిలోపనిగా అని నేను ఒచ్చాను. నావల్ల మీకు ఇబ్బంది కలుగుతుందన్న మాట. క్షమించండి. తానొవ్వక జీవించడం సాధ్యమేగాని, నొప్పించక జీవించడం అసాధ్యం అనుకుంటా."

"మనిషి గురించీ మనుషుల్లో వెదకాలిగాని దొరకని చోటికిపనిగట్టుకుని రావడం ఎందుకో!"

"మీరన్నది చాలా నిజం. కానీ నేను 'పనిలో పనిగా' అన్న మాటలు మీరు గమనికలోకి తీసుకోలేదు. అతి ముఖ్యమైనపని వేరే ఉంది."

వీడు జీడి మరకలా ఉన్నాడు; అంటుకుంటే ఒక జన్మ చాలదేమో వదలడానికి అనుకున్నాడు అనంతం.

"దిష్టి బొమ్మను చూసి పిట్టలు దూరంగా ఎగిరిపో జూసినట్టు, నన్ను చూసిన మనుషులు పారిపో తుంటారు. జన్మ ఎత్తినవాడల్లా సుందరంగా, సురిచిరంగా ఉండరు కదా," పళ్ళికిలిస్తూ అన్నాడతను.

అతన్ని తను అసహ్యించుకుంటున్నట్టు అతను గ్రహించాడని అనంతానికి ఆ మాటల ద్వారా అర్థమయింది.

"ఆబ్బె అదేమీ లేదు. మీ రూపంతో నాకేమిటీ పని. మనిద్దరం కలిసి జీవించబోవడం లేదుకదా. ఒక వ్యక్తిగత రహస్యం మీకు చెబుతాను. ముక్కూ మొహం తెలియని ఒక వ్యక్తితో కాసేపు కాలక్షేపం చేయడంలో నాకు ఏ ఇబ్బందీ ఉండదు. మరో గంటకు ఎవరి దారిన వాళ్ళం వెళ్ళిపోతాము; ఇంక కలవము. నేను స్త్రీలో కూడా అందాన్ని చూసే ప్రయత్నం చెయ్యను కనీసం ఇకపై."

"ఇకపై అనడంలో అర్థం?"

"అంతకన్నా లోతుగా నేను విషయాన్ని వివరించ దలచుకోలేదు."

"నా దగ్గర లేనిది, మీ దగ్గర పుష్కలంగా ఉంది, మన దగ్గర లేనిదాన్ని ఉన్నదానికన్నా అధికంగా ప్రేమిస్తాము, అభిలషిస్తాము. కొంతసేపటిలో మరణించబోతూ మీ ఏకాంతాన్ని పాడుచేస్తూ మీకు కష్టం ఎందుకు కలిగించాలి? మీకు దూరంగా పొమ్మంటారా? పోతాను. కొండ మాత్రం దిగను,"

"వసుదేవ కుటుంబం. మనం ఒకరికొకరం బంధువులము."

"హి హి హి..."

"ఏం, నీతో ఎలాంటి బంధుత్వం నేను కలిగి ఉండ కూడదా?"

"వసుదేవ కుటుంబం అన్న పదజాలం ఒక పెద్ద వెటకారం, ఆత్మద్రోహం. అనుకోడానికి ఆడంబరంగా ధ్వనిస్తుంది. మీతో బంధుత్వం కలిగి ఉండే అర్హత నాకు లేదు. ఆ నవ్వు ఉద్దేశం అది."

"మానవుడికి మానవుడికి గల సంబంధానికి అర్హతలతో పనిలేదు. ఏడుపైనా, నవ్వైనా సక్రమంగా లేకపోతె – కనీసం మనం సక్రమంగా లేదని భావిస్తే – చికాకు కలుగుతుంది. ఆయా పనులలో దేన్నైనా ఆ వ్యక్తి సక్రమంగానే చేశానని అనుకోవచ్చు."

"నా నవ్వు మిమ్మల్నిచికాకుపెట్టినందుకు నేను క్షమార్హుడిని. మౌనముగా కూర్చుని నిశ్శబ్దాన్ని వినడానికి జనసమూహాన్ని పరిత్యజించి వచ్చిన వ్యక్తినైనా – ముఖ్యంగా ఈ విషయం మీకు తెలియనప్పుడు – నా లాంటి వాడి ఉనికి 'రామేశ్వరం వచ్చినా శనేశ్వరం వదిలేలా లేదు' అని మీకు అనిపించక మానదు. ఒక తప్పు తప్పని తెలిసి ఎందుకు

చేస్తుంటాము? అలా చేయకుండా ఉండలేక పోవడం వలననే లేక ఒక బలవత్తరమైన కారణం వలననే.లేదా మానవ సహజ నైజం వలన."

"నీవు నా చెంత చేరి నా ఏకాంత సుఖాన్ని దూరం చేయడానికి గల కారణము ఏదన్నా ఉందా లేదా మానవ సహజ నైజం వలననా?"

"కారణం ఉంది; 'బలవత్తరమైనది'."

"అదేమిటో!?"

"ఒక మనిషి సాటి మనిషిని చేరి తన గోడును వెళ్లబుచ్చాలని ప్రయత్నిస్తుంటే, చెవులను అప్పగించడం అన్న సాయం కూడ చేయలేని దుర్దశలో ఉంది లోకం."

"ఎవరి కాలం వాళ్లకు విలువైంది కదా, ఏమీ తోచకపోతే తప్ప మరొకరికి ఎందుకు వెచ్చించాలి? మనిషి తన గోడును వినిపించుకోడానికైనా మరో మనిషి దొరక్కపోతే అతను సాగిస్తున్న జీవితపు నాణ్యత, వ్యక్తిగత విలువ ఎలాంటివో అర్థం చేసుకోవచ్చు," అసహజమైన కసితో అన్నాడు అనంతం.

"మీరు వ్యంగ్యంగా అన్నంత మాత్రాన అన్నది సత్యం కాకపోదు," కాస్త విచారంగా అన్నాడతను.

అతనికి విచారం కలిగించింది ఆ సత్యం కాదు; అనంతం గొంతులోని వ్యంగ్యం. జాలిని వ్యక్తం చేయడానికి బదులు వ్యంగ్యాన్ని పలికించడం. అది కేవలం ఇప్పుడు మొదటి సారిగా గ్రహించింది కాదు. మనిషి తనలోని తోడేలును తనకు అవసరమయినపుడు మాత్రమే విడిచిపెడుతూ మిగతా వేళల్లో కట్టిపడేసి ఉంచినా కొంత నయం.

అతని మాటలు మాధుర్యాన్ని చాకచక్యంగా ధ్వనిస్తున్నాయి. అతని చూపులు అనంతాన్నంతా ఒకేసారి పరికిస్తున్నవాటిలా ఉన్నాయి. అనంతం మౌనంగా ఉండటం, స్వల్పంగా తనంటే ఉన్న తేలిక భావం తగ్గడం అతని కళ్ళు గమనించాయి.

“నా గురించీ ఎక్కువగా అంచనా వేయకండి."

"మనసు భాషఅర్థమవుతోందే!"

"కొన్ని సందర్భాలలో ఒకే లాంటి ఆలోచనలు మరో మనసులో మెదులుతుంటాయి. మొహం అతి స్వల్పంగానైనా వాటికీ అద్దం పట్టకపోదు."

అటు తిప్పీ,ఇటు తిప్పీ ధన సహాయం అడుగుతాడేమో అనుకున్నాడు అనంతం. తను లౌక్యం ప్రదర్శించడానికి అవసరమైన అర్హత ఆ కురూపిలో, అనాథలో లేదు.

"నీతో మాట్లాడటం లేక నీవు ఏదైనా చెబితే వినడం, దానికి ఊఁ కొట్టడం అనే సహాయాలు చేయడానికి అభ్యంతరం లేదు. అంతకన్నా వేరే సహాయం నేను చేయలేను. ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతకాలి; ఎవరు యోగ్యుడైతే వాడు బ్రతికి బట్ట కడతాడు; ఆ యోగ్యత లేని వాడు నశిస్తాడు. ఎవరి ఊపిరి వాళ్ళు పీల్చుకోవాలి..."

"హి హి హి."

"ఏమి అంత భయంకరంగా నవ్వుతున్నావు?"

"నాకు కన్యాశుల్కంలో  అగ్నిహోత్రావధాన్లు గుర్తుకొచ్చాడు. గిరీశం ఎక్కడ తన ఇంట్లో తిష్ట వేస్తాడో అని 'ఈ శషభిషయాలు నా దగ్గిర పనికిరావు; మా ఇంట్లో భోజనం ఏమాత్రం వీలుపడదు' అంటాడు."

"అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మేలు కదా."

"నిర్మొహమాటంగా మాట్లాడే మీ గుణానికి జోహార్లు చెబుతున్నా. ఒక వేళ ఆ గుణం నేరంగా భావించెట్లయితే అది మీది కాదు దిష్టిబొమ్మది. అన్నట్లు మనం పెట్టే దిష్టిబొమ్మను వికారంగా కాక అతి సుందరంగా తయారుచేసినా పక్షులు దాని దగ్గిరకు రావు – అక్కడ మనిషి అనే ఒక దుర్మార్గుడున్నాడు; వాడు నన్ను భోంచేస్తాడు అన్న సత్యం ఎరిగి ఉండటం చేత. తప్పు భయపెట్టే రూపానిదేకాదు; భయపడే దానిదీనీ. అంటే ఇద్దరిదీనీ. మీ తప్పునూ ఎన్నుతున్నందుకు నన్ను దయతో క్షమించండి."

"ఆత్మా నిందా, నీపై నీకు జాలి అధికంగా ఉన్నట్టున్నాయి."

"నాకు నేను యథార్థవాదిగా భావించుకుంటాను; అలా నేను భావించుకోవడం ఎవరికీ అపకారం చేయని విషయం."

తనను అగ్నిహోత్రావధానితో పోల్చడం కలిగించిన కోపాన్ని తీర్చుకోదలచుకున్నాడు అనంతం. అతనేమి చెప్పినా, చిల్లర డబ్బులైనా అడగకుండా ఒదలడని అనంతం అభిప్రాయం. అంచేతా ఆ ప్రస్తావన మళ్ళీ తేదలచాడు.

"ధన సహాయం అడగడానికి వచ్చినవాడు అసహ్యం, భయం కలిగిస్తాడు నాలో. నన్నడిగితే, అడుక్కోడం కన్నా మోసం చేసి సంపాదించడం మెరుగైనదని అంటాను. మోసం చేయడానికి ప్రతిభా, శ్రమ, రిస్కు అవసరం. స్వయం శక్తి ద్వారా సంపాయించినది పాపపు కూడు కాదు."

"మనం చేసే వెధవ పనికికూడా ఒక సూత్రాన్నిసృష్టిస్తాము ఆత్మ ద్రోహమే అయినా. అది అలాఉంచి; చచ్చే వాడికి కాసులతోటీ, ఆకలి తోటీ పనేమిటీ? అలాంటి వాడికి ప్రాణం తీసే ఆకలి నేస్తం."

"ఒక విన్నపం: నీ రూపం గురించిన చర్చకు మంగళం పాడదాము. ఒక వ్యక్తిగత రహస్యం కాస్త మొరటుగా చెప్పాలనుంది. ఇంతవరకు ఏ స్త్రీని అనుభవించలేదుగాని, భవిష్యత్తులో అది జరిగితే ఆమెలో కూడా అందాన్ని వెదికే పని చెయ్యను. కాకపోతే శారీరక శుచిని ఆశిస్తాను. ఇక మీలాంటి కోన్కిస్కా గన్నాయి అందచందాలతో నాకు పనేలా? కంపు కొట్టకుండా ఉంటె చాలు."

ఆతను నవ్వి నవ్వి ఇక నవ్వలేక లేచిపొయ్యాడు. పొడవు నాలుగున్నర అడుగులుంటాడు. ఒక చేత్తో అతని పీకను అనంతం అవలీలగా పిసికీ చంపెయ్యగలడు. అతన్ని చంపాలన్న కోర్కె ఎందుకో అరక్షణం పాటు అనంతం మనసులో మెసిలి మాయమయింది. ఒక దోమనో, నల్లినో, బల్లినో, పేనునో, బొద్దింకనో చూసినపుడు అనిపించినట్టు. వాటిని

చంపడానికి ఒక పామునో, పులినో చంపడానికి వేసే భయం, వెనకడుగు ఉండవు. ఒక విధంగా ఈ జీవికి మేలు చేసినవాడవుతాడేమో కూడా.

"హత్య చేయడంలో తెలియని ఆనందం ఉంటుందనుకుంటాను."

"తెలిసి ఆనందమే కొందరిలోనన్నా తప్పక ఉంటుంది. నన్ను హత్యచేయాలనుందా? చట్టం, శిక్షలతోటే తంటా. ఎలానూ చావదలచుకున్నాను గనుక స్నేహ హస్తం అందించినట్టుంటుంది. పాపముండదు కనీసం," నవ్వుతూ అన్నాడు.

"నీకు ఉపయోగపడుతుందనిపిస్తే, నిన్ను హత్యకూడా చెయ్యను," అనంతం అన్నాడు ఉలికిపాటుని తెలియకుండా జాగ్రత్తపడుతూ.

"మీ కళ్ళూ, నన్ను చూస్తున్న చూపు ఎంతో అందంగా ఉన్నాయి."

"అప్రస్తుతమైన విషయం అసలువిషయాన్ని కప్పిపుచ్చడానికి అంటున్నావని నీ చూపు నాకు చెబుతోంది."

"మీ చూపులో నేను చూసిన మరో అంశం గురించీ చెప్పలేదు అంతే. జుగుప్సవల్ల బల్లినో, నల్లినో చంపుదామనిపించే భావం నన్ను చూస్తుంటే మీకు కొన్ని క్షణాలపాటు కలిగిందని నాకనిపించింది."

"నీ రూపం గురించీ మనం ఇక మాట్లాడుకో కూడదు అని అన్నానా లేదా? లోకంలో బల్లులలాంటి, నల్లులలాంటి మనుషులు లేరా అందగాళ్ళతోబాటు?"

"మీరే నేను చెప్పదలచుకోని సత్యాన్ని చెప్పేశారు."

"చంపుతానేమోనని భయం కలిగిందా?"

"చావబోతున్నవాడికి భయం ఎందుకుంటుంది? కాగల కార్యం గంధర్వులు చేస్తానంటే కావలసిందేముంటుంది?"

"కావాలని చస్తున్నప్పుడూనూ భయం ఉండకపోదు."

"ఈ విషయాన్ని ఎలా తెలుసుకున్నారు?"

"కొన్ని విషయాలు తెలియాలంటే ప్రయత్నించి తెలుసుకోనక్కరలేదు ."

"మీరు మనస్తత్వ శాస్త్రం చదవక పోయినా కొన్ని విషయాలు తెలుసని అర్థం అవుతోంది."

"అలాంటి పరిజ్ఞానం వలన నా ఒళ్ళో రూపాయికూడా రాలదు," అనంతం అన్నాడు.

"రూపాయి ఆదాయం అలాంటి పరిజ్ఞానపు విలువను కట్టడానికి పడికట్టు రాయి కాదనుకుంటా."

"నేను ప్రతి అంశాన్నీ రూపాయతో కొలవ దలచుకున్నా."

"రూపాయితో ముడివడని కష్టమూ సుఖమూ జీవితంలో ఉంటాయని నా జీవితానుభవం ద్వారా తెలుసుకున్నా."

"దారిద్ర్యం అనుభవిస్తూ కూడా రూపాయను చిన్న చూపు చూసే నీ వైఖరి నీ తెలివితక్కువతనాన్ని తెలియజేస్తోంది."

"నా తెలివితక్కువతనం నన్ను బాధించడం లేదు; బహుశా మిమ్మల్ని బాధిస్తూ ఉండొచ్చు."

"దారిద్ర్యమైనా బాధిస్తోందా?"

"లేదు."

"ఏ బాధా లేదా?"

'పోనీ ఉందనుకోండి."

"ఏమిటో అది!"

“ఎందుకు పుట్టానా అన్న ప్రశ్న బాధిస్తుంటుంది."

"ఐతే చావే దానికి మందు."

"ఒక మనిషి చావు మరొక మనిషి గంభీరంగా తీసుకోనంతగా వ్యక్తుల మధ్య అనురాగం క్షీణించినట్టుంది. స్వీయ లేక వాడి కుటుంబ సభ్యుల ప్రాణాలు మాత్రమే విలువైనవి మిగతావాళ్ళ ప్రాణాల గురించీ పట్టించుకున వలసినవసరం లేదు అనే స్థాయికి అపరిచితుల సంబంధం చేరుతుందనుకుంటాను త్వరలో. "

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS